నీట్ నుంచి బయటకు రావాలి

- దానివల్ల తెలంగాణకు నష్టం
- సుప్రీంలో సీఎం పిటిషన్ వేయాలి
- పరీక్ష నిర్వహణలో కేంద్రం ఫ్లాప్
- 'పది'పై స్పందించిన సంజయ్ ఇప్పుడెందుకు మాట్లాడట్లేదు?
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : నీట్ నిర్వహణలో కేంద్రం అట్టర్ ఫ్లాప్ అయిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. నీట్‌తో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని, అందులోంచి రాష్ట్రం బయటకు రావాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని, మంచి న్యాయవాదితో రాష్ట్రం తరఫున వాదనలు వినిపించాలని సూచించారు. తెలంగాణభవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 24 లక్షల మంది నీట్ రాశారని, వారందర్నీ గందరగోళ పరిచేలా ప్రశ్నపత్రం లీక్ అయిందని, ఆదివారం నీట్ పీజీ పరీక్ష జరగాల్సి ఉంటే పది గంటల ముందు వాయిదా వేసినట్టు ప్రకటించారని చెప్పారు. విద్యార్థులు దుబాయ్ నుంచి కూడా పరీక్ష రాసేందుకు వచ్చారని, పరీక్ష కేంద్రం ఉన్న నగరాలకు వ్యయ ప్రయాసాలకోర్చి చేరుకున్నారని తెలిపారు. కేంద్రం చివరి నిమిషంలో నీట్ పీజీ పరీక్షను రద్దు చేయడం వల్ల ఎంతోమంది విద్యార్థులు నష్టపోయారని, ఆందోళన, ఒత్తిడికి లోనయ్యారని చెప్పారు. నీట్ యూజీలో అవకతవకలు జరిగినప్పుడే పీజీ పరీక్షకూడా వాయిదా వేస్తే బాగుండేదన్నారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాలన్నింటిలో నీట్ ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని, కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. గుజరాత్, హర్యానా, బిహార్, మహారాష్ట్రలోనే పేపర్ లీక్ అయిందని, బిహార్‌లో పేపర్ లీక్ వెనక ఎన్డీయే నేత ఉన్నట్టు ఓ పత్రికలో వార్త కూడా వచ్చిందని చెప్పారు. గొర్రెల, బర్రెల కొనుగోలు కుంభకోణంలో ఈడీ విచారణ జరుపుతదని బీజేపీ ఎంపీ రఘునందన్ అన్నారని, మరి లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే నీట్ అవకతవకలపై ఈడీ దర్యాప్తు అక్కర్లేదా అని, దీనికి పీఎంఎల్‌ఏ యాక్ట్ ఎందుకు వర్తించడంలేదని ప్రశ్నించారు. చిన్న కేసులకే ఈడీని పంపే మోదీ, నీట్ అవకతవకలపై ఎందుకు రంగంలోకి దింపలేదని, సుపరిపాలన అంటే ఇదేనా? అని నిలదీశారు. గతంలో పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ అయిందని బండి సంజయ్ ఆరోపణలు చేశారని, కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలన్నారని, హైకోర్టుకు కూడా వెళ్లారని, మరి ఇప్పుడు కేంద్ర మంత్రి అయిన బండి నీట్ వ్యవహారంపై ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. నీట్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో నీట్‌పై చర్చించాలని, ఎన్డీయేలో ఉన్న చంద్రబాబు కూడా నీట్‌పై స్పందించాలని డిమండ్ చేశారు. సమావేశంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్రనేత వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు సీ కల్యాణ్, పావనిగౌడ్ పాల్గొన్నారు.

ఇసుక మాఫియాకు మంత్రి శ్రీధర్‌బాబు అండ

- ఒక లారీ అనుమతితో వంద లారీల రవాణా
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): మంత్రి శ్రీధర్‌బాబు ఇసుక, మట్టి మాఫియాను ప్రోత్సహిస్తున్నారని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆరోపించారు. యథేచ్ఛగా ఇసుక తరలిపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. మైనింగ్ ప్రమాణాలు పాటించకుండా మట్టిని తరలిస్తున్నారని, ఒక లారీకి పర్మిషన్ ఉంటే వంద లారీల్లో మట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వానికి రావాల్సిన డబ్బు శ్రీధర్‌బాబు కుటుంబసభ్యుల జేబుల్లోకి వెళ్తున్నదని ఆరోపించారు. ఓటుకు రూ.2 వేలు ఇచ్చి శ్రీధర్ బాబు ఎమ్మెల్యేగా గెలిచారని, ఎన్నికల ప్పుడు ఇసుక మాఫియా గురించి నీతులు చెప్పిన ఆయన.. ఇప్పుడు అదే దందాకు తెరలేపారని విమర్శించారు. నియోజకవర్గ స్థాయిలో అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని, రాష్ట్ర స్థాయి అధికారులైనా అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

అసలు కాంగ్రెస్ ఖూనీ!

- రేవంత్ దెబ్బకు హస్తంపార్టీ విలవిల
- పార్టీ, ప్రభుత్వంపై రేవంత్ ముద్ర
- ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే వ్యూహం
- వలసనే తలతో పాతకాపులకు పాగ
- మంత్రివర్గ విస్తరణలో తనవాళ్లు
- పదవిని పదిలపరుచుకునే దిశగా పావులు కదుపుతున్న సీఎం



హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అసలు సిసలైన కాంగ్రెస్ నాయకులకు పార్టీలో, ప్రభుత్వంలో ఏపాటి గౌరవం ఉందో మచ్చుకు ఈ ఉదంతం ఒకటి చాలు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిజమైన కాంగ్రెస్ నాయకులకు ఈ అవమానాలు నిత్యకృత్యంగా మారాయి. నిన్నటికి నిన్న మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లి ఆయన మెడలో కాంగ్రెస్ కండువా కప్పినప్పుడూ ఇదే పరిస్థితి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కానీ, ఆ జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పీ సుదర్శన్‌రెడ్డికి కానీ సమాచారం లేదు. పైగా ఆయన పార్లమెంట్ ఎన్నికలకు నిజామాబాద్ ఇన్‌చార్జీగా కూడా ఉన్నారు. కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కాంగ్రెస్‌లో చేరిక సమయంలోనూ సేమ్ టు సేమ్. వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై మొదట ఉమ్మడి వరంగల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులంతా వ్యతిరేకించారు. సంజయ్‌కుమార్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, దానం నాగేందర్ వీరి చేరికలు మచ్చుకే అయినప్పటికీ, ఇవి అధికార కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సైతం ఈ చేరికల గురించి సమాచారం ఉండడం లేదట. పార్టీలో చేరికల విషయం ఆయన కూడా టీవీల్లో చూసే తెలుసుకుంటున్నట్టు సమాచారం.

ఎందుకీ చేరికలు?

ఇప్పటికిప్పుడు ఎమ్మెల్యేలను చేర్చుకోవాల్సిన అనివార్య పరిస్థితి రాష్ట్రంలో లేదు. తన బలాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం అధికార పార్టీకి లేదు. కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీలో పూర్తి మెజార్టీ ఉంది. అసెంబ్లీ సభ్యుల సంఖ్య ప్రకారం మ్యాజిక్ ఫిగర్ 60 మంది ఎమ్మెల్యేలు కాగా ప్రస్తుతం ఆ పార్టీకి అంతకంటే ఐదుగురు ఎక్కువే ఉన్నారు. మిత్రపక్షం సీపీఐతో కలిపి చూస్తే అవసరమైన సభ్యుల కంటే ఆరుగురు సభ్యులు ఎక్కువే. మరి అలాంటప్పుడు ఆరు గ్యారెంటీల అమలును కూడా పక్కన పెట్టి చేరికలపై రేవంత్‌రెడ్డి ఎందుకు దృష్టి కేంద్రీకరిస్తున్నారన్నదే ప్రశ్న.

రెండున్నర ఏండ్ల ఫార్ములా?

తెలంగాణ కంటే ముందు దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టింది. అక్కడ సీఎం పోస్టుకు పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్దరామయ్య తీవ్ర స్థాయిలో పోటీ పడ్డారు. మధ్యేమార్గంగా కాంగ్రెస్ అధిష్ఠానం లోపాయికారీగా వీరిద్దరి మధ్య చెరో రెండున్నరేండ్లకు ఒప్పందం కుదిర్చినట్టు జాతీయ మీడియా కోడై కూసింది. అదే సీన్ తెలంగాణలోనూ రిపీట్ అయింది. సీఎం పోస్టుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్‌పీ నేత భట్టివిక్రమార్క పోటీ పడగా, కర్ణాటక తరహా ఫార్ములానే తెలంగాణలో అమలు చేయాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం ఆలోచనగా పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో సీఎంగా తన సీటును ఐదేండ్లపాటు పూర్తి కాలం పదిల పరుచుకోవడానికి, పార్టీలో, ప్రభుత్వంలో తన బలం పెంచుకోవడానికి రేవంత్‌రెడ్డి ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకునే పనిలో పడ్డారని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. గతంలో తనతో పాటు టీడీపీలో ఉన్న సహచరులు అయితే విశ్వాసంగా ఉంటారని రేవంత్‌రెడ్డి ఆలోచనగా చెబుతున్నారు. టీడీపీలో తనతో కలిసి పనిచేసిన సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు ఇప్పటికే మంత్రివర్గంలో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కడియం శ్రీహరి, ఎన్నికల తర్వాత పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి తెచ్చుకోగలిగారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి భార్య సునీతా మహేందర్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇచ్చి పార్టీలో చేర్చుకున్నప్పటికీ ఆమె విజయం సాధించలేకపోయారు.

కాంగ్రెస్‌పై తన ముద్ర

పార్టీపైనా, ప్రభుత్వంపైనా తన ముద్ర చెక్కుచెదరకుండా ఉండేందుకు దూరదృష్టితో రేవంత్‌రెడ్డి తన వ్యూహాన్ని అమలు చేస్తున్నట్టు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. సీఎం పదవి తప్ప తన మంత్రిమండలిపై రేవంత్‌రెడ్డికి పట్టులేదు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనరసింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ వీరంతా కాంగ్రెస్ పార్టీ భూమి పుత్రులే. కొత్తగా మంత్రులు అయిన సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పూర్వాశ్రమం టీడీపీలో సహచరుడు అయిన తుమ్మల నాగేశ్వర్‌రావు మాత్రమే తన వాళ్లుగా రేవంత్‌రెడ్డి విశ్వసిస్తున్నట్టు సమాచారం. ఇంతమంది కాంగ్రెస్ పాత కాపుల మధ్య ప్రస్తుత సీఎం సీటు, రాజకీయ భవిష్యత్తు సురక్షితం కాదనే విషయాన్ని రేవంత్‌రెడ్డి ముందుచూపుతో గ్రహించే చేరికలను ఉధృతం చేశారని అటు కాంగ్రెస్‌లో తలపండిన నేతలు, ఇటు రాజకీయ పరిశీలకు అంచనా వేస్తున్నారు. పైగా ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి పరపతి కూడా తగ్గినట్టు పార్టీలో బలంగా వినిపిస్తున్నది. ఇప్పటికే పాత కాంగ్రెస్ మంత్రులంతా తనకు వ్యతిరేకంగా ఒక జట్టుగా తయారు అవుతున్నట్టు రేవంత్‌రెడ్డి అనుమానిస్తున్నట్టు సమాచారం. పార్లమెంట్ ఫలితాల అనంతరం అధిష్ఠానం వద్ద బలహీనపడిన రేవంత్, తదుపరి పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో, మంత్రివర్గ విస్తరణలో తనకు విశ్వసపాత్రులైన వారికి చోటు లభించేలా వ్యూహాత్మక అడుగులతో పావులు కదుపుతున్నట్టు సమాచారం.

రాత్రి 11 దాటితే తన్నుడే?

దుకాణాలు బంద్ చేయాల్సిందే • హైదరాబాద్ ప్రజలకు పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అదుపు తప్పిన శాంతిభద్రతలను కట్టడి చేయటానికి ప్రభుత్వం నకిలీ మంత్రాన్ని నమ్ముకున్నట్టు కనిపిస్తున్నది. దాదాపు పదిహేను రోజుల్లోనే సుమారు పది వరకు హత్యలు, దోపిడీలు రాజధానిలో వెలుగు చూశాయి. దీంతో శాంతి భద్రతల కట్టడికి ఆంక్షలు విధిస్తూ నేరుగా ఎలాంటి ప్రకటన వెలువడకపోయినా, రెండు రోజుల కిందట 'రాత్రి 11లోపే దుకాణాలు మూసివేయాలి. అర్ధరాత్రి తిరిగితే కఠిన చర్యలు తప్పవు. నో ఫ్రెండ్లీ పోలీస్... ఓన్లీ లాఠీచార్జి పోలీస్' అంటూ పోలీస్ పెట్రోలింగ్ జీపుల్లోని మైకులో వచ్చే ప్రకటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పాతబస్తీలోని ఓ ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనంలోని మైకు నుంచి వచ్చిన ఈ ప్రకటన అందరినీ విస్మయానికి గురి చేసింది. ఆదివారం కాంగ్రెస్ ఎక్స్ హ్యాండిల్‌లోనూ ఇదే విషయాన్ని పోస్ట్ చేశారు. 'దుకాణాలు రాత్రి 10:30 లేదా 11 గంటల్లోపు మూసివేయాలి. శాంతి భద్రతలకు భంగం కలిగించొద్దు. అర్ధరాత్రి జులాయిగా తిరిగితే కఠిన చర్యలు తప్పవు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు. రోడ్లపై అల్లర్లు సృష్టించవద్దు. అనుమానాస్పద వ్యక్తులకు లిఫ్ట్ ఇవ్వవద్దు. గంజాయి బ్యాచ్‌ను వదిలి పెట్టే ప్రసక్తే లేదు' అంటూ హైదరాబాద్ ప్రజలకు పోలీసు శాఖ హెచ్చరికలు జారీచేసిందని, ముఖ్యమంత్రి ప్రత్యేక ఆదేశాలతో పోలీసులు రంగంలోకి దిగనట్టుగా హెచ్చరిస్తూ ట్వీట్ చేసింది.

భగ్గుమన్న బీఆర్ఎస్, ఒవైసీ

కాంగ్రెస్ సర్కారు అనధికారిక ఆదేశాలపై బీఆర్ఎస్ భగ్గుమన్నది. నేరాలను నియంత్రించటం, నేరస్థులను పట్టుకోవటం ప్రభుత్వానికి చేతకావటం లేదని పార్టీ వర్గాలు ఎద్దేవా చేశాయి. ముఖ్యమంత్రి శాంతిభద్రతలను గాలికొదిలేసి.. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయటంలో బిజీగా ఉన్నారని పార్టీ నేతలు విమర్శించాయి. పాతబస్తీలో మాత్రమే పోలీసులు మైకులతో ప్రకటనలు చేయటంపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. పోలీసులు జూబ్లీహిల్స్‌లో అలాంటి ప్రకటన చేస్తారా? అని హైదరాబాద్ సిటీ పోలీస్‌కమిషనర్‌కు ట్వీట్ చేశారు. ఇరానీ చాయ్ హోటల్స్, పాన్‌షాపులు, వాణిజ్య సంస్థలు కనీసం 12 గంటల వరకు తెరిచి ఉంచడానికి అనుమతించాలని, నగరమంతా ఒకే విధానాన్ని అమలుచేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా మెట్రోనగరాల్లో రాత్రి సమయంలో దుకాణాలను తెరిచేందుకు అనుమతిస్తారని హైదరాబాద్‌లో ఎందుకు భిన్నంగా ఉండాలని ప్రశ్నించారు. మరోవైపు అనధికారిక ఆదేశాలపై నెటిజన్లు కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని చెడుగుడు ఆడేశారు. హైదరాబాద్ లాంటి మహానగరంలో 24 గంటల పాటు పనిచేసే సంస్కృతి ఐటీ కారిడార్‌లో ఉంది. అక్కడ విధులు నిర్వహించే ఉద్యోగులు ఏ సమయంలోనైనా ఆఫీసు నుంచి ఇండ్లకు వెళ్లే అవకాశం ఉంటుంది. పోలీసుల నిర్ణయాలు వారిని ఇబ్బంది పెట్టే అవకాశం ఉన్నదని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేశారు. రాత్రి 11 గంటలకు ఆఫీస్ అయిపోయాక హోటళ్లు మూసివేస్తే ఎక్కడ తినాలి? ఇది హైదరాబాదా.. పల్లెటూరా? అంటూ ఓ నెటిజన్ సత్యజిత్ ప్రశ్నించారు. విమర్శల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ట్వీట్‌ను డిలీట్ చేసింది.

నిబంధనల ప్రకారమే మూసివేస్తున్నాం

అనధికారిక సమాచారం వ్యాప్తిలోకి రావటం, పోలీసులపై విమర్శలు వ్యక్తమవటంతో హైదరాబాద్ నగర పోలీసు విభాగం స్పందించింది. నగరంలో గతంలో ఉన్న నిబంధనల మేరకు రాత్రి సమయంలో దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలను మూసివేస్తున్నట్టు వివరణ ఇచ్చింది. 11 గంటలకే దుకాణాలు మూసివేయాలని పోలీసులు ఆదేశించారంటూ సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని తెలిపింది.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

ఫిరాయింపులపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): అధికారంలో ఉన్నామని విర్రవీగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కాంగ్రెస్ పార్టీకి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్నవారి కన్నా ప్రజలకే బలం ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 2004-06లోనూ అనేక సార్లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన విషయాన్ని ఆయన ఎక్స్‌వేదికగా గుర్తుచేశారు. ఇప్పుడే కాదు అప్పుడు కూడా బీఆర్ఎస్ ఇబ్బందులను ఎదుర్కొన్నదని, తమ పార్టీకి కష్టాలు ఎదుర్కోవడం కొత్తకాదని తెలిపారు. నాడు కాంగ్రెస్ పార్టీ నీతిలేని వ్యవహారాలపై తెలంగాణ ప్రజలు ఆందోళనలను ఉధృతం చేశారని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ తల వంచక తప్పలేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫిరాయింపులకు పాల్పడేందుకు ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా ప్రజలు బుద్ధిచెప్తారని, చరిత్ర పునరావృతం అవుతుందని పేర్కొన్నారు.

ఇదేనా రాజ్యాంగ రక్షణ?

పార్టీ ఫిరాయించిన ప్రజాప్రతినిధులు స్వతహాగా అనర్హులయ్యేలా రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను సవరిస్తామని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ పెద్దమాటలు మాట్లాడారని, కానీ అందుకు విరుద్ధంగా పార్టీ ఫిరాయింపుదారులను ప్రోత్సహిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదేనా రాజ్యాంగ రక్షణ? అంటూ ఎక్స్ వేదికగా రాహుల్‌గాంధీని నిలదీశారు. ఫిరాయింపు నిరోధక చట్టం నిబంధనలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యే అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలనే సుప్రీంకోర్టు తీర్పును సైతం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఉల్లంఘించారని గుర్తుచేశారు. ఇది రాజ్యాంగ రక్షణా లేక అపహాస్యమా? అని ప్రశ్నించారు. తాము ఈ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

రైతు భరోసా ఎవరికి వద్దు?

మొదటిపేజీ తరువాయి...

చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ యోజన పథకం నిబంధనలనే రైతుభరోసాకు కూడా వర్తింపజేసేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమాలోచనలు జరుపుతున్నట్టు వార్తలొచ్చాయి. దీంతో రాష్ట్రంలోని సగంమంది రైతులకు రైతుభరోసా అందదని, ఫలితంగా వ్యవసాయ రంగం మళ్లీ సంక్షోభంలోకి వెళ్తుందనే ఆందోళన వ్యక్తమైంది.

రైతుబంధు స్ఫూర్తికే తూట్లు

రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించి వారిని అప్పులపాలు కాకుండా కాపాడుకోవడం, ప్రతి ఎకరా భూమిని సాగులోకి తీసుకొనిరావడం తద్వారా వ్యవసాయ ఉత్పత్తులు, ఉత్పాదకతలను పెంపొందించడం, వ్యవసాయరంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టడం అనే మహోన్నత లక్ష్యాలతో కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధుకు శ్రీకారం చుట్టగా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆ పథకం స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ కొందరికే పరిమితం చేసేందుకు ప్రయత్నిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతుభరోసా అమలుకు విధివిధానాలు నిర్ణయించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేస్తూ ఇటీవల జరిగిన క్యాబినెట్ భేటీలో నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రైతుభరోసా నిబంధనల్లో మార్పులపై రైతుల అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించినట్టు మంత్రి తుమ్మల తెలిపారు. మంగళవారం రైతు వేదికల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి, అభిప్రాయాలు స్వీకరించాలని అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు. రైతుల అభిప్రాయాలను కూడా పరిగణనలోనికి తీసుకొని క్యాబినెట్ సబ్‌కమిటీ నిబంధనలు రూపొందిస్తుందని పేర్కొన్నారు. రైతుభరోసాను ఆలస్యం చేసేందుకే సబ్‌కమిటీ ఏర్పాటు చేశారన్న బీఆర్ఎస్ విమర్శలను ఆయన తప్పపట్టారు. 'సీఎం అంటే కటింగ్ మాస్టరా?' అంటూ బీఆర్ఎస్ అధ్యక్షుడు కేటీఆర్ చేసిన ట్వీట్‌పై మంత్రి తుమ్మల స్పందిస్తూ.. 'సీఎం అంటే కటింగ్ మాస్టర్ కాదు.. కరెక్షన్ మాస్టర్' అంటూ ప్రభుత్వ పథకాల్లో కోతలను సమర్థించుకునే ప్రయత్నం చేశారు. తమ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కండ్లు అని పేర్కొన్నారు.

చెదిరిన నేతన్నల బతుకులు!

- చేనేత రంగంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం
- బీఆర్ఎస్ ప్రభుత్వ స్కీములన్నీ రద్దు
- ఆర్డర్లు లేక నేతన్నల ఇబ్బందులు
- పడకేసిన చేనేత, రాష్ట్ర వస్త్ర శాఖ

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ చేనేత, వస్త్ర శాఖ పూర్తిగా పడకేసింది. నేతన్నల నుంచి వస్త్రాలను సేకరించి వివిధ ప్రభుత్వ సంస్థలకు అందజేసేందుకు ఉద్దేశించిన పథకాలన్నీ నిలిచిపోయాయి. స్కూలు పిల్లల యూనిఫామ్స్ మినహా వస్త్రాల తయారీ కోసం నేతన్నలకు ఇస్తున్న ఆర్డర్లన్నీ ఆగిపోయాయి. దీంతో అటు వస్త్ర శాఖలోని ఉద్యోగులు, ఇటు నేతన్నలకు పనిలేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చేనేత కళలు మసకబారుతున్నాయి. నేతన్నలకు చేతినిండా పని కల్పించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ సర్కారు విద్యార్థుల యూనిఫామ్స్‌తోపాటు బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్ తదితర పథకాలను అమలు చేసింది. వీటితోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన వస్త్రాలు, కిందిస్థాయి ఉద్యోగుల యూనిఫామ్స్ కోసం బట్టలను నేతన్నల ద్వారా తయారు చేయించేవారు. ప్రతి ఏటా రూ. 600కోట్ల వరకూ విలువైన బట్టల తయారీకి నేతన్నలకు ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చేది. ఫలితంగా రాష్ట్రంలోని సుమారు 35 వేల పైచిలుకు నేతన్నలకు ప్రతినెలా రూ. 15000లకు తగ్గకుండా ఆదాయం లభించేది. ముఖ్యంగా సిరిసిల్ల, వరంగల్ ప్రాంతాల్లోని నేతన్నలు ఎక్కువగా ప్రభుత్వం ద్వారా వచ్చే ఆర్డర్లపై ఆధారపడి వస్త్రాలు తయారు చేసేవారు. దాదాపు పదేండ్లపాటు కేసీఆర్ ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగిన వీరి జీవనం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ప్రమాదంలో పడింది. కేవలం స్కూలు యూనిఫామ్స్ మినహా ఇతర ఆర్డర్లేవీ వారికి ఇవ్వలేదు. పాఠశాలలు తెరుచుకునే సమయం పూర్తికావడంతో ఇప్పుడు నేతన్నలంతా పనిలేకుండా ఖాళీ అయ్యారు. టెక్స్‌టైల్ శాఖలో కార్యకలాపాలు ఏమీ లేకపోవడంతో అక్కడి ఉద్యోగులకు కూడా పనిలేకుండాపోయింది.

చేనేత కళలకు విఘాతం

రాష్ట్రంలోని చేనేత చీరలకు దేశవ్యాప్తంగా పేరుంది. వివిధ రకాల డిజైన్లను తయారు చేయడంలో మన నేతన్నలు నైపుణ్యం సాధించారు. ముఖ్యంగా పోచంపల్లి చేనేత వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఇక్కడ తయారయ్యే ఇక్కత్ ఫ్యాబ్రిక్‌తో యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ ద్వారా బెస్ట్ టూరిజం విలేజ్‌గా పోచంపల్లికి ఖ్యాతి దక్కింది. జరీ అంచులతో చీరల తయారీకిగాను గద్వాల చీరలకు, వినూత్న టెంపుల్ బార్డర్‌లతో చీరల తయారీకిగాను నారాయణపేట చీరలు, గొల్లభామ చీరలు ఎంతగానో ప్రఖ్యాతిగాంచాయి. ఈ కళలకు భవిష్యత్తు తరాలకు అందించాలన్నసంకల్పంతో కేసీఆర్ గడచిన పదేండ్లపాటు చేనేత రంగానికి ఎంతగానో సహకారం అందించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కళలు మసకబారుతున్నాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది.

నిలిచిన సంక్షేమ కార్యక్రమాలు

- తెలంగాణ వీవర్స్ థ్రిఫ్ట్ ఫండ్ సేవింగ్ అండ్ సెక్యూరిటీ స్కీమ్(టీఎఫ్ఎస్ఎస్) కింద నేతన్నలు పొదుపు చేసుకున్న సొమ్ముకు మరో రెండింతలు ప్రభుత్వం కలిపి వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసేది. ఎనిమిది నెలలుగా ఇందులో ప్రభుత్వ వాటా జమ కాలేదు.
- బట్టల తయారీకి సంబంధించి యార్న్, డైస్, కెమికల్స్ తదితర ముడిసరుకుపై ప్రభుత్వం 40శాతం సబ్సిడీ ఇచ్చేది. కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి ఈ స్కీము పూర్తిగా నిలిచిపోయింది.
- రైతు బీమా తరహాలో నేతన్న బీమా స్కీమును కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. నేతన్నలు ఏ కారణం చేత చనిపోయినా వారం రోజుల్లో రూ. 5లక్షల బీమా సొమ్ము వారి కుటుంబ సభ్యులకు అందించేవారు. ఎనిమిది నెలలుగా ఈ పథకానికి సంబంధించిన ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయాయి.
- పావలా వడ్డీ, మార్కెటింగ్ సపోర్ట